సాక్షి
నిర్మల్
శనివారం । 28 । డిసెంబర్ । 2024



కార్మికులకు రక్షణ పరికరాలేవి?
పరిసరాలు పరిశుభ్రతలో పారిశుధ్య కార్మికులది కీలకపాత్ర. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కార్మికులకు రక్షణ పరికరాలు అందడం లేదు. వ్యాధుల బారిన పడుతున్నారు. 10లో



కనెక్షన్ల కోసం నిరీక్షణ
లక్ష్మణచాంద మండలంలోని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం రైతులు నిరీక్షిస్తున్నారు. దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా కనెక్షన్లు ఇవ్వడం లేదు. 11లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
29.5 / 19.5
ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. చల్లగాలులు వీస్తాయి. గాలితో తేమ ఎక్కువగా ఉంటుంది. చలి ప్రభావం తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మన్మోహన్‌సింగ్ సేవలు మరువలేనివి



సంస్మరణ సభలో పాల్గొన్న ఎమ్మెల్యే బొజ్జు

ఖానాపూర్: భారతదేశ ప్రధానిగా కాంగ్రెస్ నేత మన్మోహన్‌సింగ్ చేసిన సేవలు మరువలేనివని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సంస్మరణ సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఆర్బీఐ గవర్నర్‌గా, ఆర్థిక వేత్తగా దేశాన్ని ముందుకు నడపడంలో ఆయన చేసిన కృషి గర్వకారణమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు దయానంద్, షబ్బీర్‌పాషా, రమేశ్, యూసుఫ్‌ఖాన్, వెంకాగౌడ్, సత్యనారాయణ, తోట సత్యం, మాజిద్, సంతోష్, పెద్దులు, శేషాద్రి, శంకర్, షౌకత్‌పాషా, సలీంఖాన్, జహీర్, నయీం, శ్రీనివాస్, మాధవ్, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్జీటీలను ఎస్‌వోలుగా నియమించొద్దు..!



తాటి గంగాదాస్, జిల్లా అధ్యక్షుడు



ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి

కుంటాల: తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 17 రోజులుగా సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు నిరవధిక దీక్ష కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం కేజీబీవీలలోఎస్జీటీలను ఎస్వోలుగా నియమించాలని ఉత్తర్వులు జారీ చేయడం సమంజసం కాదని ఎస్జీటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి తాటి గంగాదాస్, ఎల్మల ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. కుంటాలలో శుక్రవారం మాట్లాడారు. సమ్మె చేస్తున్న కారణంగా కేజీబీవీలలో సీఆర్టీలు కొద్ది రోజులుగా విద్యార్థులకు పాఠాలు బోధించక విద్య అందని ద్రాక్షగా మారిందన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తామన్న ప్రభుత్వం, ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని కోరారు.

మత సామరస్యం చాటుకున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్



నర్సారెడ్డికి అయ్యప్ప ప్రతిమ అందిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్ అలీ

సోన్: కడ్తాల్ శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో గురుస్వామి నర్సారెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడిపూజ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప దీక్ష చేపట్టిన స్వాములకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సయ్యద్ అర్జుమంద్ అలీ అన్నదానం చేశారు. దగ్గరుండి స్వాములకు భోజనం వడ్డించారు. మతాలు వేరైనా మనుషులంతా ఒక్కటే అనే భావనతో అన్నదానం చేసినట్లు తెలిపాడు. ఇందులో కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశ్, నాయకులు జునైద్ మెమన్, మతిన్, చిన్ను, భూమేష్, తదితరులున్నారు.

కేజీబీవీల్లో డిప్యుటేషన్లు రద్దు చేయాలి

- సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు

నిర్మల్‌ఖిల్లా: జిల్లా, మండలపరిషత్ పాఠశాలల ఉపాధ్యాయులను కేజీబీవీల ఇన్‌చార్జి ఎస్‌వోలుగా నియమిస్తూ ఇచ్చిన డిప్యూటేషన్లను వెంటనే రద్దు చేయాలని అదిలాబాద్ - కరీంనగర్ - మెదక్ - నిజామాబాద్ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి, సీపీఎస్ ఉద్యోగుల సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు డిమాండ్ చేశారు. పాఠశాలల్లో విద్యాబోధనకు ఆటంకం ఏర్పడుతుందని, అటు అనుభవం లేనటువంటి వ్యవస్థలో పనిచేయడం వల్ల ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొన్నారు. కేజీబీవీలో విధుల నిర్వహణకు ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా సుముఖంగా లేరని తెలిపారు. తక్షణమే ఈ ఆలోచన విరమించుకోవాలని సూచించారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో కేజీబీవీ సమస్యలు తక్షణమే పరిష్కరించలాని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, వీలైనంత తొందరగా సమస్యలకు పరిష్కారమార్గం చూపాలని కోరారు.

మారిన రాజకీయం

- లోక్‌సభ ఎన్నికలు విజయవంతం
- పార్టీలు మారిన ప్రజాప్రతినిధులు, నాయకులు
- సర్కారు ఏర్పడి ఏడాదైనా దక్కని మంత్రి పదవి
- ఎన్నో మార్పులకు వేదికైన 2024

రివైండ్ 2024 — పొలిటికల్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కాల చక్రం గిర్రున తిరిగింది. 2024 సంవత్సరం అప్పుడే పూర్తవుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అనేక రాజకీయ మార్పులను చరిత్రలో నమోదు చేసింది. గత ఏడాది శాసనసభ ఎన్నికలు జరగ్గా.. ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం రాజకీయంగా అనేక మార్పులను తీసుకొచ్చింది. ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గ స్థానాన్ని బీజేపీ నిలబెట్టుకోగా.. పెద్దపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసింది. బీఆర్‌ఎస్ పార్టీ రెండు స్థానాల్లో ఓటమితో ప్రాతినిధ్యం కోల్పోయింది. ప్రత్యక్షంగా.. పరోక్షంగా రాజకీయంగా అనేక మార్పులు సంభవించాయి.



కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి సమక్షంలో హస్తం పార్టీలో చేరుతున్న ఇంద్రకరణ్‌రెడ్డి(ఫైల్)

వరించిన పదవులు

ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పలువురికి రాష్ట్ర స్థాయిలో రాజకీయంగా ప్రాధాన్యత దక్కింది. జనవరిలో తెలంగాణ జనసమితి అధ్యక్షుడు, టీజేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ ముద్దసాని కోదండరామ్‌కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి దక్కింది. ఆయన స్వస్థలం మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం జోగాపూర్. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆయనకు రాజకీయంగా ఈ ప్రాధాన్యత దక్కింది. గత జూలైలో దండేపల్లి మండలానికి చెందిన కోట్నాక తిరుపతి రాష్ట్ర గిరిజన సహకార ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నియామకం అయ్యారు. ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర స్థాయిలో ఈయన ఒక్కరికే నామినేటెడ్ పదవి దక్కడం గమనార్హం. ఇక సింగరేణి కార్మిక సంఘ నాయకుడు ఐఎన్టీయూసీ సీనియర్ నేత జనక్‌ప్రసాద్‌కు రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్‌గా అవకాశం దక్కింది. వీరు తప్ప మిగతా ఎవరికీ రాజకీయంగా రాష్ట్రస్థాయిలో నామినేటెడ్ పదవులు దక్కలేదు. సీనియర్ నాయకులు, కార్యకర్తలు పదవుల కోసం ఎదురు చూస్తున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు లేవు..

స్థానిక సంస్థల ఎన్నికలు ఈ ఏడాదిలో జరుగుతాయని కింది స్థాయి నాయకులు ఆశించినప్పటికీ జాప్యం జరిగింది. తాజా, మాజీలు, నాయకులు కొత్త ఏడాదిలో పంచాయతీ, పరిషత్ ఎన్నికల్లో సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. కొత్త సంవత్సరంలో మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి. మంచిర్యాల కార్పొరేషన్ కూడా ఏర్పడితే తొలిసారిగా కొత్త ఏడాదిలో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది.

ఊరించిన మంత్రి పదవి

అదిగో ఇదిగో మంత్రివర్గ విస్తరణ అంటుండగానే ఏడాదికాలం గడిచిపోయింది. ఉమ్మడి జిల్లా నుంచి నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ మంచిర్యాల, చెన్నూరు ఎమ్మెల్యేల మధ్య మంత్రి పదవీ కోసం పోటీ తీవ్రంగా ఉంది. ఈ ఏడాదిలో విస్తరణ జరగకపోవడంతో ఉమ్మడి జిల్లా నుంచి కేబినెట్ బెర్త్ ఊరించి ఉసూరుమనిపించింది. కొత్త ఏడాదైనా ఉమ్మడి జిల్లా నాయకుల్లో ఎవరికైనా మంత్రి యోగం ఉంటుందో..! లేదో..! అనేది వేచి చూడాలి.

గోడ దూకిన లీడర్లు..

గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం, ఈ ఏడాదిలో లోక్‌సభ ఎన్నికల సమయంలో పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పార్టీలు మారారు. తమకు కలిసి వచ్చే పార్టీ కండువాలు కప్పుకున్నారు. గత ఫిబ్రవరిలో మాజీ ఎంపీ వెంకటేష్‌నేత బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరి పెద్దపల్లి లోక్‌సభ స్థానం నుంచి టికెట్ ఆశించారు. కానీ ఆయనకు టికెట్ దక్కలేదు. దీంతో రెండున్నర నెలల్లోనే మళ్లీ బీజేపీలో చేరారు.

- బీఆర్‌ఎస్ నాయకుడు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ దండే విఠల్ అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముథోల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు విఠల్‌రెడ్డి మార్చి 21న సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.
- మార్చిలో బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ ఎంపీ గొడం నగేశ్ బీజేపీలో చేరారు. ఆయనకు బీజేపీ ఆదిలాబాద్ టికెట్ ఇవ్వడంతో ఎంపీగా పోటీ చేసి గెలుపొందారు.
- ఇక బీఎస్పీ రాష్ట్ర చీఫ్‌గా ఉన్న మాజీ ఐపీఎస్, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ లోక్‌సభ ఎన్నికల సమయంలోనే ఆ పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. నాగర్‌కర్నూల్ స్థానం నుంచి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. ఆయన బీఆర్‌ఎస్‌లో చేరడంతో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కాంగ్రెస్‌లో చేరారు. అదే సమయంలో మాజీ మంత్రి, సీనియర్ నేత ఇంద్రకరణ్‌రెడ్డి గులాబీ పార్టీని వీడి హస్తం గూటికి చేరారు. మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఈ ఏడాది చివరలో బీజేపీ నాయకుడు, మాజీ ఎంపీ సోయం బాపురావు, బీఆర్‌ఎస్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు కాంగ్రెస్ గూటికి చేరారు.

కొనసాగుతున్న సమగ్ర ఉద్యోగుల సమ్మె



మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

నిర్మల్ రూరల్: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె కొనసాగుతోంది. 17 రోజులుగా ఆర్డీవో కార్యాలయం ఎదుట దీక్ష చేస్తున్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు. దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి కాపాడిన మహానుభావుడని కొనియాడారు. ఆర్థిక వ్యవస్థలో పెను మార్పులు తీసుకొచ్చిన ఘనుడు అని పేర్కొన్నారు. శుక్రవారం నుంచి సమగ్ర శిక్ష ఉద్యోగులందరూ పూర్తిస్థాయి సమ్మెలో పాల్గొన్నారు. 15 రోజుల ముందుగానే జిల్లా అధికారులకు సమ్మె నోటీసు అందించినా ఎలాంటి ఫలితం లేదు. దీంతో కేజీబీవీ బోధనేతర సిబ్బంది, అకౌంటెంట్లు, ఏఎన్ఎంలు, వ్యాయామ ఉపాధ్యాయులు, స్కావెంజర్లు, వాచ్ ఉమెన్‌లు, స్వీపర్లు స్వచ్ఛందంగా సమ్మెలోపాల్గొని తోటి ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. కేజీబీవీలో ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంపై సమగ్ర శిక్ష ఉద్యోగులు మండిపడ్డారు. తాత్కాలిక బోధన సిబ్బందిని నియమించడం ఎంత మాత్రం సమంజసం కాదని వాపోయారు. సీఎం రేవంత్ రెడ్డి వెంటనే తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. వీరికి పీఆర్టీయూ టీఎస్ మామడ మండల ఉపాధ్యాయులు దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు.

'స్థానిక' ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే రామారావుపటేల్

భైంసాటౌన్: త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి అన్నారు. ముథోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్ఎస్ కాటన్‌లో బూత్ కమిటీ ఎన్నికలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే పార్టీ సాధారణ, క్రియాశీలక సభ్యత్వ నమోదు పూర్తయిందని తెలిపారు. ఈనెల 29, 30, 31 తేదీల్లో మండలాధ్యక్షుల ఎన్నిక ఉంటుందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ భూమయ్య, ఎన్నికల ఇన్‌చార్జి రవిపాండే, రాష్ట్ర కార్యవర్గసభ్యులు నారాయణరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ సాయినాథ్, జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అయ్యప్ప మండల పూజ



పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



పూజలో పాల్గొన్న భక్తులు

ఖానాపూర్: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం ఆధ్వర్యంలో అయ్యప్ప మహా మండల పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతీ ఒక్కరు భక్తి భావం పెంపొందించుకొని ఆధ్యాత్మిక మార్గంలో నడవాలన్నారు. అయ్యప్ప ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అడిదెల రాజన్న, గౌరవ అధ్యక్షుడు కొత్తపెల్లి సురేశ్, నాయకులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు కృషి చేద్దాం

- డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్



సారంగాపూర్ పీహెచ్‌సీలో రక్త పరీక్షలు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్

సారంగపూర్: రక్తహీనత లేని, పూర్తి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి అందరూ సహకారం అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్ అన్నారు. కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో రక్తహీనత నిర్ధారణకుగాను హెచ్‌బీ(హీమోగ్లోబిన్) పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకేరోజు జిల్లా వ్యాప్తంగా హెచ్‌బీ పరీక్షలు నిర్వహించేందుకు మాక్‌డ్రిల్ నిర్వహించామని తెలిపారు. ఇది పూర్తిస్థాయిలో సఫలమైతే మున్ముందు ఇలాంటి పరీక్షలు వారంలో ఒకరోజు తప్పకుండా చేయించేందుకు చర్యలు చేపడతామని అన్నారు. ఇప్పటికే ఎంతోమంది గర్భిణుల్లో రక్తహీనత సమస్యలు ఉత్పన్నమవుతున్న తరుణంలో ఈపరీక్షలు ఎంతగానో ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. అనంతరం చించోలి(బి) గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రంలో నిర్వహించిన మాక్‌డ్రిల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా మాస్‌మీడియా అధికారి రవీందర్, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమోహన్‌గౌడ్, మోయిన్ అలీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రం ప్రజావ్యతిరేక విధానాలు ఎండగడదాం



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ

- ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ

నిర్మల్‌చైన్‌గేట్: కార్మికవర్గానికి ద్రోహం చేస్తున్న మోదీ సర్కార్, కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడదామని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ అన్నారు. టీయూసీఐ జిల్లా 7వ మహాసభలు జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో సంఘ భవనంలో జిల్లా అధ్యక్షుడు బక్కన్న అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మిక హక్కులను కాలరాస్తోందన్నారు. సంపద సృష్టికర్తలు కార్మికుల కుటుంబాలకు కన్నీళ్లు మిగిల్చిన కేంద్ర ప్రభుత్వానికి పతనం తప్పదని హెచ్చరించారు. ఎన్నికల వాగ్దానాలు విస్మరించి, మోదీ జన్ ధన్ ఖాతా పేరుతో పేద వారికి రూ.15 లక్షల జమ, నిత్యావసర సరుకుల ధరల నియంత్రణ, ఏటా రెండు కోట్ల కొలువులు, ప్రజాస్వామిక పరిపాలన హామీలు నీటి మూటలుగా మారాయన్నారు. ప్రభుత్వ రంగాలను అంబానీ, అదానీ లాంటి పెట్టుబడిదారులకు అమ్మేసి, కార్మికుల ఉపాధి, భద్రత దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న మాట్లాడుతూ ఉద్యమకారులను ప్రశ్నించే గొంతులను నిర్బంధిస్తున్నారని, పోరాడి హక్కులను, జీవితాలను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అహంకారపు చర్యలతో, రాష్ట్రాన్ని అప్పుల కుంపటిగా, అవినీతికి నిలయంగా మార్చి ప్రజల జీవితాలతో చెలగాటాలాడారన్నారు. రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని ఎలాంటి ఆంక్షలు లేకుండా కార్మికులందరికీ జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించి ప్రజల మన్నన పొందాలన్నారు. సమావేశంలో టీయూసీఐ కార్యదర్శి సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి నందిరామయ్య, పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.గంగన్న, జి.గంగమణి, రేష్మ, దేవవ్వ, పోశెట్టి, గఫూర్, లక్ష్మి పాల్గొన్నారు.

పాతవారికి మళ్లీ పిలుపు

- జేఆర్వోల కోసం పూర్వ వీఆర్వో, వీఆర్‌ఏల నుంచి ఆప్షన్లు
- 2022లో వ్యవస్థను రద్దు చేసిన గత ప్రభుత్వం
- జిల్లా వ్యాప్తంగా వివిధ శాఖలకు 844 మంది బదలాయింపు
- సర్వీసు పరిగణనలోకి తీసుకోవాలంటున్న పూర్వపు వీఆర్వోలు



జిల్లాలో మొత్తం వీఆర్వోలు	96
వివిధ శాఖలలో భర్తీ అయిన వీఆర్వోలు	93
ఇంకా రిపోర్టు చేయకుండా ఉన్న వీఆర్వోలు	3
మొత్తం వీఆర్‌ఏలు	748
మరణించిన వీఆర్‌ఏలు	12
డైరెక్ట్ రిక్రూట్మెంట్ అయిన వీఆర్‌ఏలు	60

నిర్మల్‌చైన్‌గేట్: గ్రామాల్లోకి మళ్లీ వీఆర్వోలు రానున్నారు. ఇటీవల అసెంబ్లీ ఆమోదించిన భూ భారతి బిల్లులలో కొత్తగా గ్రామస్థాయిలో రెవెన్యూ అధికారులను నియమించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు మళ్లీ వీఆర్వో వ్యవస్థను అమలు చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. గ్రామాల్లో పనిచేసేందుకు రెవెన్యూ అధికారుల నియామకానికి కసరత్తు మొదలుపెట్టింది. సర్వేయర్ల నియామకంపైనా దృష్టి పెట్టింది. గతంలో వీఆర్వోలు, వీఆర్‌ఏలుగా పనిచేసి ఇతర శాఖల్లోకి బదిలీ అయినవారి నుంచి ఆప్షన్లు స్వీకరిస్తోంది. ఈ నెల 28వ తేదీలోగా వివరాలు అందజేయాలని స్పష్టం చేశారు. కొత్త అధికారుల రాకతో రెవెన్యూ వ్యవస్థ బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

జిల్లాలో 844 మంది..

జిల్లా నుంచి వీఆర్వో(గ్రామ రెవెన్యూ అధికారి)గా 96 మంది, వీఆర్‌ఏ(గ్రామ రెవెన్యూ సహాయకుడు)గా 748 మంది ఇలా మొత్తంగా 843 మంది విధులు నిర్వర్తించారు. వీఆర్వో, వీఆర్‌ఏ వ్యవస్థను గత ప్రభుత్వం రద్దు చేసి వివిధ ప్రభుత్వ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్, మున్సిపాలిటీల్లో వార్డు అధికారులుగా బదలాయించడంతో విధులు నిర్వహిస్తున్నారు. వివిధ శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్న వారిని తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకుంటారని కలెక్టరేట్ సిబ్బంది సమాచారం అందిస్తున్నారు. అందుకోసం గూగుల్ ఫామ్ పంపిస్తున్నారు.

సర్దుబాటు ఇలా...

జిల్లాలోని 96 మంది వీఆర్వోలను అప్పటి కలెక్టర్ ముషరఫ్ అలీ జిల్లా అధికారుల సమక్షంలో లక్కీ డ్రా నిర్వహించారు. వ్యవసాయ, సహకార శాఖ 3, పశు సంవర్ధక శాఖ 2, వెనుకబడిన తరగతులు 2, అటవీ శాఖ 3, ఫైనాన్స్ 2, ఐ అండ్ పీఆర్1, వైద్య శాఖ 1, ఉన్నత విద్య 22, హోం శాఖ 4, పరిశ్రమలు 1, ఇరిగేషన్ 6, మైనార్టీ 1, మున్సిపల్ 7, పంచాయతీరాజ్ 36, సెకండరి ఎడ్యూకేషన్1, ఆర్‌అండ్‌బీ, రవాణా 2, మహిళా శిశు సంక్షేమ శాఖకు 2 పోస్టులను కేటాయించారు.


సర్వీసు నిబంధనలపై దిగులు..

వీఆర్వో, వీఆర్‌ఏ వ్యవస్థ రద్దు కావడంతో ఆయా విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను ఇతర శాఖల్లో సర్దుబాటు చేయగా, జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్ హోదాల్లో ఆయా శాఖల్లో విధులు నిర్వహిస్తున్నారు. శాఖల బదలాయింపుతో అప్పటికే తమ సీనియారిటీ పోయిందన్న ఆందోళనలో ఉన్న వీఆర్వో, వీఆర్‌ఏలకు మళ్లీ పాత పోస్టింగ్ సంకేతాలు వెలువడుతుండటంతో ఆందోళన రేకెత్తుతోంది. ఇప్పటికే సీనియారిటీ పోయిందని ఆవేదన చెందుతుండగా, వెనక్కి పంపితే సర్వీసు నిబంధనలు ఎలా ఉంటాయోననే దిగులు వారిలో కనిపిస్తోంది.

ప్రస్థానం...

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2002లో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఉన్న సమయంలో వీఏవో(విలేజ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్)లకు గ్రామ కార్యదర్శులుగా అదనపు బాధ్యతలు అప్పగించి వేతనం పెంచారు. 2007లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి వారిని వీఆర్వో(విలేజ్ రెవెన్యూ ఆఫీసర్)లుగా గుర్తించి గ్రామ రెవెన్యూ బాధ్యతలను అప్పగించారు. నాటి నుంచి వీఆర్వోలుగా కొనసాగుతూ వస్తున్నారు. 2014లో బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక ధరణిని తీసుకొచ్చింది. ఈ క్రమంలో రెవెన్యూ శాఖలో జరిగిన అనేక మోసాలు, అవినీతిపై కుప్పలు తెప్పలుగా ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో రెవెన్యూశాఖలోని వీఆర్వో, వీఆర్‌ఏ వ్యవస్థను 2020లో రద్దు చేసింది. వారందరినీ ప్రభుత్వంలోని ఇతర 36 శాఖల్లోకి సర్దుబాటు చేసింది. ఈ విషయంపై వీఆర్వోలు కోర్టుకు వెళ్లగా ఇప్పటికీ తీర్పు రిజర్వులోనే ఉంది.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



భూ సమస్యల పరిష్కారం కోసం తీసుకొచ్చిన భూభారతి చట్టానికి ఆహ్వానం పలుకుతున్నాం. ఈ చట్టాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుగా మళ్లీ మాతృశాఖకు తీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నాం. అలాగే మా సర్వీస్, ప్రమోషన్ల గురించి ప్రభుత్వం నిర్ణయం ప్రకటించాలి.
– అన్నెల గంగాధర్, పూర్వపు వీఆర్వో

28 లోపు వివరాలు అప్‌లోడ్ చేయాలి

వీఆర్వో, వీఆర్‌ఏ నుంచి వివిధ ప్రభుత్వ శాఖల్లోకి వెళ్లిన వారికి సమాచారం అందిస్తున్నాం. మళ్లీ రెవెన్యూ శాఖలోకి వచ్చేందుకు ఆసక్తి ఉన్న వారి నుంచి గూగుల్ ఫామ్ ద్వారా వివరాలు సేకరిస్తున్నాం. అందరూ 28వ తేదీలోగా గూగుల్ ఫామ్‌లో వివరాలు అప్‌లోడ్ చేయాలని తెలిపాం.
– సూర్యారావు, కలెక్టరేట్ ఏవో

క్లుప్తంగా

అద్దెబస్సు డ్రైవర్ ఆందోళన

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ఆర్టీసీ డిపోలో అద్దె బస్సు డ్రైవర్ ఫిరోజ్‌ఖాన్ ఆందోళన చేపట్టాడు. శుక్రవారం విధులకు రాగా సెక్యూరిటీ సిబ్బంది బ్రీత్ ఎన్‌లైజర్ పెట్టినప్పుడు 15 ఎంఎల్ వచ్చిందని, మద్యం తాగే అలవాటు లేకపోయినా తాగినట్లు వచ్చిందని వాపోయారు. పోలీసుస్టేషన్‌లో బ్రీత్ ఎన్‌లైజర్‌తో సున్న ఎంఎల్ వచ్చిందని, బ్రీత్ ఎన్‌లైజర్‌లోనే ఏదో లోపం ఉందని డ్రైవర్ చెబుతున్నాడు. ఉదయం నుంచి కార్మికులకు ఇదే పరికరంతో చేస్తే సున్న వచ్చిందని అధికారులు తెలిపారు. డ్రైవర్ తర్వాత అప్పటికప్పుడు మరొకరికి బ్రీత్ ఎన్‌లైజర్‌తో చెక్‌చేయగా సున్న ఎంఎల్ వచ్చిన విషయాన్ని అధికారులు గుర్తుచేశారు. కొద్దిసేపటికే తర్వాత అధికారులు అనుమతించడంతో డైవర్ డ్యూటీకి వెళ్లిపోయారు.

ఆటో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని పత్తర్‌ఘట్టికి చెందిన వాజికర్ రాజుకు చెందిన ఆటో ఈనెల 25న చోరీకి గురైంది. రోజులాగే తన ఇంటి ముందు రాత్రి పార్కింగ్ చేశారు. తర్వాత రోజు ఉదయం చూసే సరికి ఆటో కనిపించకుండా పోయింది. దీంతో చుట్టుపక్కలా గాలించినప్పటికీ ఆచూకీ దొరకలేదు. బాధితుడు ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

భక్తురాలి మెడలో గొలుసు చోరీ

బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తురాలి మెడలో బంగారు గొలుసును ఇద్దరు గుర్తుతెలియని యువకులు ఎత్తుకొని పారిపోయారు. పోలీసులు తెలిపిన వివరాలు.. నిర్మల్ జిల్లా కుంటాల మండలం కల్లూరుకు చెందిన సుశీల తన మనవడి పుట్టువెంట్రుకలు కోసం కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం బాసరకు వచ్చారు. గోదావరిలో పుణ్యస్నానాలు చేసి అమ్మవారి దర్శనానికి వెళ్తున్నారు. ఈక్రమంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు సుశీల మెడలో రెండు తులాల బంగారు గొలుసును ఎత్తుకొని పారిపోయారు. స్థానికులు అందించిన సమాచారంతో సీఐ మల్లేశ్ తన సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని బాధితురాలి నుంచి వివరాలు తెలుసుకున్నారు. గోదావరి నది బ్రిడ్జి వద్ద చెక్‌పోస్ట్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధుడు మృతి



వృద్ధుడి మృతదేహం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం బీఎస్ఎన్ఎల్ కార్యాలయం గద్దె వద్ద గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందాడు. రైల్వే స్టేషన్, బస్టాండ్ ప్రాంతాల్లో భిక్షాటన చేసుకుని జీవించే వృద్ధుడు మృతిచెందాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ ప్రమోద్‌రావు ఘటనస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చూరీ గదిలో భద్రపర్చినట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే స్థానిక పోలీసుస్టేషన్‌లోని 8712656534, 9390560335 సెల్‌నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కార్మికులకు రక్షణ పరికరాలేవి?



కోటపల్లి మండలం కొల్లూరులో పారిశుధ్య పనులు చేస్తున్న పారిశుధ్య సిబ్బంది (ఫైల్)

- అందని శానిటైజర్లు, బూట్లు, రేడియం జాకెట్లు
- రక్షణ సామగ్రి లేక పారిశుధ్య పనులు
- అనారోగ్య సమస్యలతో మల్టీపర్పస్ వర్కర్లు

కోటపల్లి: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచి ప్రజల ఆరోగ్యం కాపాడటంలో మల్టీపర్పస్ వర్కర్లది కీలక పాత్ర. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా వారు అనారోగ్యానికి గురయ్యే పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లాల్లోని పల్లెల్లో ఉదయం వీధుల్లో రోడ్లు ఊడుస్తున్న వారికి రక్షణ సామగ్రి ఇవ్వడం లేదు. మురుగుకాల్వలు శుభ్రం చేయడం, చెత్తాచెదారం ఎత్తడం వంటి పనులు చేస్తున్నారు. చేతిగ్లౌజులు, సబ్బులు, మాస్కులు, శానిటైజర్లు, హెల్మెట్లు, బూట్లు రేడియంతో కూడిన జాకెట్లు ఇవ్వాల్సి ఉంటుంది. కాని రక్షణ సామగ్రి ఇవ్వకుండానే పనులు చేయాలని అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. ఒక్కోసారి మురుగుకాల్వల్లో పూడిక తొలగిస్తుండగా గాజుముక్కలు గుచ్చుకుంటున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	మండలాలు	పంచాయతీలు	వర్కర్లు
ఆదిలాబాద్	18	468	480
కుమురంభీం	15	335	360
నిర్మల్	18	396	420
మంచిర్యాల	16	311	346

పెరిగిన పనిభారం

ఆరోగ్య సంరక్షణకు పరిశుభ్రతే ప్రధాన ఆయుధమని గుర్తించిన గత ప్రభుత్వం పల్లెల్లో మల్టీపర్పస్ వర్కర్లను నియమించింది. పంచాయతీల్లో ఇంటింటి నుంచి చెత్త సేకరించి వీధుల్లో అపరిశుభ్రత నెలకొనకుండా చూసుకోవడమే వీరి ప్రధాన కర్తవ్యం. నిత్యం మురుగుకాల్వలు, శుభ్రం చేయడం, వీధులు ఊడవడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, సోడియం హైపోక్లోరైడ్ ద్రావణం పిచికారీ చేయడం వంటి పనులు విరామం లేకుండా చేశారు. చెత్తాచెదారాన్ని ట్రాక్టర్‌లోకి ఎత్తడం, డంపింగ్‌యార్డులకు తరలించడం వంటి పనులు చేస్తున్నారు. కాల్వల్లో పేరుకుపోయిన వ్యర్థాలు తొలగించడంతో పాటు దోమల నియంత్రణకు మందులు పిచికారీ చేస్తున్నారు. దీంతో వీరికి పనిభారం పెరిగింది.

నిధుల లేమితో..

గ్రామ పంచాయతీ నిధుల ద్వారా రక్షణ సామగ్రిని కొనుగోలు చేసి మల్టీపర్పస్ వర్కర్లకు అందించాల్సి ఉంటుంది. జీపీల్లో నిధుల కొరత వెంటాడుతోంది. అధికారులు రక్షణ సామగ్రిలోని ఒకటి, రెండు వస్తువులు కొనుగోలు చేసి వారికి ఇస్తూ కాలం వెళ్లదీస్తూ వస్తున్నారు.

రక్షణ సామగ్రి అందిస్తాం



పంచాయతీల్లో మల్టీపర్పస్ వర్కర్లు నిత్యం పారిశుధ్య పనులు చేపడుతుంటారు. వారికి రక్షణ సామగ్రి అందించాలని గతంలో కార్యదర్శులకు ఆదేశించాం. పంచాయతీల నిధుల నుంచి రక్షణ సామగ్రి అందేలా చర్యలు తీసుకుంటాం.

– సత్యనారాయణ, ఎంపీవో

సీఏ ఫలితాల్లో సత్తా

- లక్ష్యం సాధించిన బాసర విద్యార్థి
- నాడు సీపీటీ పరీక్షలో తొలి ప్రయత్నంలో విజయం



తల్లిదండ్రులతో శ్రౌతి విష్ణు

బాసర: పట్టుదల, దృఢసంకల్పానికి కృషి తోడైతే అసామాన్యమైన విజయం కూడా సునాయాసం అవుతుందని నిరూపించాడు బాసరకు చెందిన శ్రౌతి విష్ణు. తండ్రి శ్రౌతి శ్రీపాదరావు పూజారి, తల్లి శ్రౌతి సీమాతాయి ఉపాధ్యాయురాలు. పదో తరగతి తర్వాత సీఏ కావాలని విష్ణు కలలుగన్నాడు. నిజామాబాద్‌లో ఇంటర్ పూర్తిచేసి కళాశాల టాపర్ నిలిచాడు. బెంగళూరులో సీపీటీ కోచింగ్ తీసుకున్నాడు. చిన్నప్పటినుంచే చదువుల్లో ముందుడే విష్ణు.. తొలి ప్రయత్నంలోనే సీపీటీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి సీఏ కావాలన్న లక్ష్యానికి మరో అడుగు ముందుకేశాడు. తర్వాత హైదరాబాద్‌లో ఐపీసీసీ కోర్సు పూర్తిచేసి ఆర్టికల్ షిప్ కోసం మళ్లీ బెంగళూరు వెళ్లాడు. కరోనా మహమ్మారి కారణంగా విరామం కాస్త ఇబ్బంది పెట్టింది. అయినా విజయవంతంగా ఆర్టికల్ షిప్ పూర్తిచేసి గ్రూప్ ఎగ్జామ్‌కు ప్రిపేర్ అవడం మొదలు పెట్టాడు. ఈ ప్రయత్నంలో కొందరు మధ్యలో విరమించుకోవడం, సీనియర్లు రిజల్ట్ సాధించకపోవడంతో వంటివి కాస్త డిస్టర్బ్ చేసినా.. విష్ణు తన లక్ష్యం నుంచి ఏమాత్రం పక్కకు జరగలేదు. దీనికితోడు.. 'ఇలాంటి టఫ్ కోర్సు ఎందుకు ఎంచుకున్నావు. ఇంజినీరింగ్ చేస్తే మంచి ఉద్యోగం వచ్చేది'అంటే నిరాశపర్చే మాటలు వినిపించినా వెనక్కు తగ్గకుండా శ్రమించాడు. గురువారం రాత్రి తర్వాత విడుదలైన సీఏ ఫలితాల్లో సత్తాచాటాడు.

లక్ష్యంతో చదివాను

తల్లిదండ్రులు, అక్క, బాబాయ్ ప్రోత్సాహం, బాసర సరస్వతీ అమ్మవారి ఆశీస్సులతోనే సీఏ ఫలితాల్లో సత్తాచాటాను. ఒక లక్ష్యంతో చదివాను. దాదాపు రెండు నెలలు ఫలితాలు ఆలస్యంతో ఆందోళన పెరిగింది. గురువారం అర్ధరాత్రి విడుదలైన ఫలితాలు నాలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. – విష్ణు

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు

- పాత కక్షలతో వ్యక్తి హత్యకు కుట్ర
- రూ.50వేల సుపారీ ఇచ్చి పథకం
- చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న బెల్లంపల్లిరూరల్ సీఐ

బెల్లంపల్లిరూరల్: కుమురం భీం జిల్లా కాగజ్‌నగర్ మండలం పాతసర్సాలకు చెందిన పాముల పురుషోత్తంపై ఈనెల 24న హత్యాయత్నానికి పాల్పడి కారును ఆపహరించుకుని పోయిన నిందితులను పోలీసులు అరెస్టుచేశారు. బెల్లంపల్లి రూరల్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ అఫ్జలొద్దిన్ ఈమేరకు వివరాలు వెల్లడించారు. పాతసార్సాల గ్రామానికి చెందిన పాముల శివసాయి, జాడి శ్యామ్‌రావులకు గతంలో పురుషోత్తంతో విభేదాలు ఉన్నాయి. పాతకక్షలు మనస్సులో పెట్టుకుని ఆయన హత్యకు కుట్ర పన్నారు. కాగజ్‌నగర్, మహారాష్ట్ర రాష్ట్రం బల్లార్షాకు చెందిన పెంటపర్తి రమేశ్ అలియాస్ చింటు, సముద్రాల మహేశ్ అలియాస్ సురేష్, ఋషికేష్ ప్రదీప్ కుమార్‌లకు రూ.50 వేలు సుపారీ ఇచ్చి హత్యకు పథకం రచించారు. ఈనెల 24న రమేశ్, సురేష్, ప్రదీప్‌కుమార్‌లు..కాగజ్‌నగర్ నుంచి మంచిర్యాలకు వెళ్లేందుకు పురుషోత్తంకు చెందిన కారును కిరాయి మాట్లాడుకున్నారు. మార్గమధ్యలో బెల్లంపల్లికి చేరుకోగానే శ్రీనిధి హోమ్స్ సమీపంలో ఒకరిని దించాలని కోరడంతో పురుషోత్తం వాహనాన్ని యూటర్న్ తీసుకుని తిరుమల హిల్స్ వైపు తిప్పాడు. ఇదే అదునుగా మూత్రవిసర్జన కోసం వాహనాన్ని ఆపిన నిందితులు పురుషోత్తంను తీవ్రంగా గాయపర్చారు. చనిపోయాడని నిర్ధారించుకున్న తర్వాత కారును, రూ.3500 నగదు, సెల్‌ఫోన్‌ను అపహరించుకుని కాగజ్‌నగర్ వైపు వెళ్లారు. దీంతో పురుషోత్తం కుమారుడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ వేగవంతం చేశారు. శుక్రవారం తాండూర్ మండలం మాదారం 3 ఇంక్‌లైన్ సమీపంలోని అడవిలో ఉన్న నిందితులను అదుపులో తీసుకుని రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి కారు, ఆరు సెల్‌ఫోన్లు, రూ.5 వేల నగదు జప్తు చేశారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ అఫ్జలొద్దిన్, ఎస్సైలు రమేశ్, మహేందర్, ప్రసాద్‌లను మంచిర్యాల డీసీపీ భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అభినందించారు. తాళ్లగురిజాల, బెల్లంపల్లి టూటౌన్, నెన్నెల ఎస్సైలు పాల్గొన్నారు.

కోల్‌బెల్ట్ ప్రాంతం సబ్బండవర్గాలకు నిలయం

- సౌత్ ఇండియా మూవీ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శంకర్



దర్గా వద్ద డైరెక్టర్ శంకర్, తదితరులు

మందమర్రిరూరల్: కోల్‌బెల్ట్ ప్రాంతం కవులు, కళాకారులు, ఉద్యమకారులు తదితర సబ్బండ వర్గాలకు నిలయమని సౌత్ ఇండియా మూవీ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నిమ్మల శంకర్ పేర్కొన్నారు. ఆయన దర్శకత్వంలో తీసిన 'జై బోలో తెలంగాణ సినిమా'లో మందమర్రికి చెందిన గఫూర్ పీరీలను చిత్రీకరించానని, అప్పుడు పీరీలకు మొక్కు చెల్లిస్తానని మొక్కుకున్నానని తెలిపారు. శుక్రవారం కుమారుడు దినేష్‌తో కలిసి ఇక్కడకు వచ్చారు. కేకే ఓసీ వద్ద గఫూర్ దర్గాను సందర్శించారు. అనంతరం గఫూర్ ఇంటి వద్ద గల పీరీలకు దట్టీలు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. తర్వాత స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు నివాసానికి వెళ్లి కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాటి నిజాం కాలం నుంచి రాష్ట్ర ఏర్పాటు వరకు జరిగిన చరిత్రను వెబ్‌సిరీస్‌లో తీసుకుస్తానని తెలిపారు. మలిదశ ఉద్యమంలో అంతడుపుల నాగరాజు లాంటి కళాకారులకు ప్రభుత్వం సముచిత స్థానం కల్పించాలని కోరారు. అంతకుముందు స్థానిక కళాకారులు శంకర్‌కు ఘనస్వాగతం పలికారు. కళాకారులు అంతడుపుల నాగరాజు, ఉప్పులేటి నరేశ్, రాజమౌళి, ప్రభాకర్, రాజేశ్వరావు, హనుమాండ్ల మధుకర్, రాకం సంతోష్, గట్ల సారంగపాణి తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు

లట్కూరి రవి(ఫైల్)

భీమిని: ట్రాక్టర్‌తో వ్యక్తి పొలంలో జంబుకొడుతుండగా విద్యుత్ షాక్‌కు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కన్నెపల్లి మండలం మాడవెల్లి పంచాయతీ పరిధి బొత్తపల్లికి చెందిన లట్కూరి రవి (32) ట్రాక్టర్‌తో ఈనెల 20న చేలలో జంబు కొడుతుండగా విద్యుత్ తీగలు ఆయన ముఖంపై పడి గాయాలయ్యాయి. స్థానికులు, కుటుంబీకులు మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి పంపించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కుటుంబీకులు డెడ్‌బాడీతో కన్నెపల్లి సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే మృతి చెందాడని, తమకు న్యాయం జరిగే వరకు ధర్నా విరమించబోమని వారు స్పష్టం చేశారు. విషయం తెలుసుకున్న తాండూర్ సీఐ కుమారస్వామి, కన్నెపల్లి ఎస్సై గంగారాం, విద్యుత్ అధికారులు అక్కడికి వెళ్లారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీతో ధర్నా విరమించారు. భార్య లావణ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బకాయిలు చెల్లించని మిల్లర్లపై చర్యలు



టేకుమట్లలో బాలాజీ రైసుమిల్లులో రికార్డులు పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ శ్రీధర్‌రెడ్డి

జైపూర్: ప్రభుత్వానికి రైసుమిల్లు యజమానులు ధాన్యం పెండింగ్ బకాయిలు చెల్లించని పక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని సివిల్ సప్లయి టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ శ్రీధర్ హెచ్చరించారు. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం టేకుమట్ల గ్రామంలో బాలాజీ రైసుమిల్లు, ముదిగుంటలో బీఎస్‌వై రా రైసు మిల్లులను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలాజీ రైసుమిల్లు నిర్వాహకులు 2023–24 ఖరీఫ్‌లో 2,305 మెట్రిక్ టన్నుల ధాన్యం బకాయిలు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉందని, దీని విలువ రూ.5.5కోట్లు అని తెలిపారు. బీఎస్‌వై రా రైస్‌మిల్లు 2022–23 రబీ సీజన్‌లో 3,858 మెట్రిక్‌టన్నుల ధాన్యం, 2023–24 ఖరీఫ్ సిజన్‌లో 2,687మెట్రిక్ టన్నుల ధాన్యం చెల్లించాల్సి ఉందని, దీని విలువ సుమారు రూ.19కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. రెండు రైసుమిల్లుల నిర్వాహకులతో అంగీకార పత్రం రాయించుకున్నట్లుగా తెలిపారు. ఈ నెల 31లోగా పెండింగ్ బకాయిలు చెల్లించని పక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అసిస్టెంట్ సివిల్ సప్లయి అధికారి వేణుగోపాల్, సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్ స్రవంతి, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సుదర్శన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వేధింపులతో యువకుడి ఆత్మహత్య

- ఆస్పత్రి, మెడికల్ ఏజెన్సీ నిర్వాహకులపై కేసు



వంశీకృష్ణ (ఫైల్)

నిర్మల్: తనకంటూ ఉపాధి పొందడంతోపాటు జీవితంలో స్థిరపడొచ్చన్న ఆశతో ఓ యువకుడు ఓ ఆస్పత్రిలో పెట్టిన భాగస్వామ్యం తన నిండుప్రాణాన్ని తీసుకుంది. జిల్లాకేంద్రంలోని నాయుడివాడకు చెందిన కొర్తికంటి వంశీకృష్ణ(25) ఈనెల 24న నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించాడు. పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి జిల్లా జనరల్ ఆస్పత్రిలో మృతిచెందాడు. వంశీకృష్ణ రాసిన సూసైడ్ లెటర్‌తోపాటు పట్టణ సీఐ ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. వంశీకృష్ణ స్థానిక ప్రియా నర్సింగ్‌హోమ్‌లో పార్ట్‌నర్‌గా ఉన్నాడు. ఈక్రమంలో రెండు మెడికల్ ఏజెన్సీల నుంచి ఆస్పత్రి కోసం మందులు తీసుకున్నాడు. ఇటీవల ఆస్పత్రిలో ప్రధాన భాగస్వామిగా ఉన్న నాందేడపు శ్రీధర్‌తో గొడవ కావడంతో వంశీకృష్ణ దూరంగా ఉంటున్నాడు. మెడికల్ కోసం తీసుకువచ్చిన ఏజెన్సీల బిల్లులను నిర్వాహకులు ఆస్పత్రి నుంచి చెల్లించలేదు. ఇదే సందర్భంలో మందులు ఇచ్చిన మెడికల్ ఏజెన్సీల నిర్వాహకులు మారుగొండ రోహిత్, పూదరి శివకుమార్, గున్నాల రంజిత్‌లు తమ డబ్బుల కోసం ఆస్పత్రి నిర్వాహకులను కాకుండా తమ వద్ద నుంచి నువ్వే తీసుకున్నావంటూ వంశీకృష్ణను పలుమార్లు వేధించారు. అటు ఆస్పత్రి, ఇటు మెడికల్ ఏజెన్సీల నుంచి వస్తున్న వేధింపులను తట్టుకోలేక వంశీకృష్ణ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈమేరకు తల్లి జయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాందేడపు శ్రీధర్, మారుగొండ రోహిత్, పూదరి శివకుమార్, గున్నాల రంజిత్‌లపై కేసులు నమోదు చేసినట్లు పట్టణసీఐ ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. ఈ కేసులో నిందితులుగా ఉన్నవారు బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు చెందినవారు ఉండటం జిల్లాకేంద్రంలో చర్చనీయాంశంగా మారింది.

జీవితంపై విరక్తితో యువకుడు..

ఇంద్రవెల్లి: మానసికస్థితి సరిగా లేని యువకుడు జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై భీంరావ్ కథనం ప్రకారం.. మండలంలోని ఏమాయికుంట పంచాయతీ పరిధి న్యూహీరాపూర్ (రమాయినగర్)కు చెందిన మెస్రం నాగేష్(20) గత కొంతకాలంగా మానసిక స్థితి సరిగ్గా లేదు. కుటుంబీకులు నాటువైద్యం చేయించిన నయం కాకపోవడంతో నాగేశ్ తీవ్ర మనస్తాపం చెందాడు. జీవితంపై విరక్తితో గురువారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకున్నాడు. ఇంటికొచ్చిన తల్లిదండ్రులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తండ్రి మెస్రం శేకు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

దుబాయ్‌లో గొల్లమాడ వాసికి అనారోగ్యం



ఆర్మూర్‌లో కోటపాటిని కలిసి విన్నవిస్తున్న జైరాం కుటుంబ సభ్యులు

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడ గ్రామానికి చెందిన కేసారాం జైరాం దుబాయ్‌లోని ఓ నిర్మాణ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. 15 రోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురైన ఆయన పక్షవాతం బారిన పడ్డాడు. కంపెనీ అధికారులు అతన్ని అక్కడి ఆస్పత్రిలో చేర్పించారు. ఆయనకు సరైన చికిత్స చేయించి ఇంటికి క్షేమంగా రప్పించాలని కుటుంబీకులు కోరుతున్నారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో ప్రవాస భారతీయుల హక్కులు, సంక్షేమ వేదిక అధ్యక్షుడు కోటపాటి నరసింహం నాయుడును కలిసి విన్నవించారు. స్పందించిన ఆయన దుబాయ్‌లోని ఇండియన్ ఎంబసీ, ప్రవాస భారతీయుల హక్కులు, సంక్షేమ వేదిక దుబాయ్ కోఆర్డినేటర్ బాలకిషన్‌కు జైరాం సమాచారం అందించారు. ఆయన్ను తిరిగి స్వగ్రామానికి పంపే ఏర్పాట్లు చేయాలని విన్నవించారు. ఆయన హైదరాబాద్ చేరుకున్నాక ఎన్ఆర్ఐ సెల్ అధికారుల సహకారంతో నిమ్స్‌లో చేర్పించడానికి ఏర్పాట్లు చేయాల్సిందిగా అధికారులకు వినతిపత్రం పంపించారు.

అకాల వర్షం... అన్నదాతకు కష్టం



బేల మండల కేంద్రంలోని జిన్నింగ్ మిల్లులో పత్తి అమ్మేందుకు వచ్చిన రైతులు నానా తంటాలు పడుతున్నారు. గంటల తరబడి మిల్లు ఎదుట అంతర్రాష్ట్ర రహదారిపై వాహనాలతో బారులు తీరి నిరీక్షించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో శుక్రవారం మోస్తరు వర్షం కురిసింది. దీంతో పత్తి తడవకుండా రైతులు కవర్లు కప్పుకొన్నారు. శనివారం కూడా వర్షాలు కురిసే అవకాశముందని, రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ అధికారులు సూచిస్తున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

